సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 17 । ఆగస్టు । 2023



వైట్ కాలర్ నేరాలపై దృష్టి

వైట్ కాలర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. బుధవారం ఆమె జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. 8లో ▸



డ్వాక్రా మహిళలకు న్యాయం

నూజివీడు ఎమ్మెల్యే పోరాట ఫలితంగా డ్వాక్రా సంఘాల మహిళలకు న్యాయం చేకూరింది. రూ.1.08 కోట్లను చెల్లించేందుకు యూబీఐ అంగీకరించింది. 8లో ▸



హత్య కేసులో ముగ్గురి అరెస్టు

మనువడి హత్య కేసులో తాత, తండ్రి నానమ్మను పెంటపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. మీనవిల్లూరులో ఈ నెల 9న హత్య జరిగింది. 8లో ▸

న్యూస్‌రీల్

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): వచ్చేనెల 9న ఉమ్మడి పశ్చిమ గోదావరి వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి కోరారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో ఏలూరు డివిజన్ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులను ఉద్దేశించి రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులలో కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇందు కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేయాలన్నారు. కక్షిదారులకు కౌన్సెలింగ్ ద్వారా కేసులను ఎక్కువగా రాజీ చేయవచ్చని సూచించారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

సాక్షి, భీమవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షకు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు వచ్చే నెల 16 లోపుగా చెల్లించాలని తెలిపారు.

20న జిల్లా స్థాయి చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20న భీమవరంలో పాతూరి నర్సింహరాజు మెమోరియల్ జిల్లా సబ్ జూనియర్స్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్, పట్టణ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు చెప్పారు. బుధవారం చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా వివరాలు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2008 జనవరి 1 తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన బాలురు ఈ నెల 24 నుంచి అనంతపూర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్–15 ఓపెన్ చెస్ పోటీలు, బాలికలు సెప్టెంబర్‌లో ధర్మవరంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–15 బాలికల చెస్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఇతర వివరాలకు 90632 24466 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఎస్సైలకు పదోన్నతిపై పరిశీలనకు జాబితా

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో 20 మంది ఎస్సైలకు పదోన్నతులు కల్పించేందుకు శాఖాపరమైన ఇబ్బందులు ఏవైనా ఉన్నాయా? అంటూ ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పోలీస్‌శాఖ కేంద్ర కార్యాలయానికి నివేదించారు. పదోన్నతుల జాబితాలో 20 మంది సర్కిల్ ఇన్స్‌పెక్టర్లుగా పదోన్నతి పొందేందుకు అర్హత కలిగి ఉన్నారని, వారిపై శాఖాపరమైన అభ్యంతరాలు ఉంటే వాటిపై వివరణ ఇవ్వాలంటూ నోట్ పెట్టారు. ఏలూరు రేంజ్ పరిధిలో ప్రమోషన్ ప్యానెల్‌లో తూర్పుగోదావరి నుంచి నలుగురు, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇద్దరు, కాకినాడ జిల్లా నుంచి ఐదుగురు, ఎన్టీఆర్ జిల్లా నుంచి ముగ్గురు, కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లా నుంచి ఒక్కొక్కరు, ఏపీ ట్రాన్స్‌కో, సీఐడీ విభాగాల నుంచి ఒక్కొక్కరు, ఇంటెలిజెన్స్ నుంచి ఇద్దరు ఉన్నారు. వీరంతా 2022–23 సంవత్సరానికి పదోన్నతులు పొందేందుకు సీనియారిటీ జాబితాలో ఉన్నారని సమాచారం.

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు(మెట్రో): కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సూచనల మేరకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు 2023 సంవత్సరానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ బుధవారం తెలిపారు. ఆటలు, సామాజిక రంగం, సేవలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, ఆవిష్కరణలలో అసాధారణ సామర్థ్యాలు ప్రదర్శించిన 18 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన అర్హులైన బాలల నుంచి ఆగస్టు 31లోగా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

రేషన్ వాహనాలకు వాహన మిత్ర



రేషన్ వాహనాలు

- జిల్లాలో 356 రేషన్ వాహనాలు
- ఈ నెల 31న ఖాతాల్లో జమ

భీమవరం (ప్రకాశంచౌక్): పేదలకు ఇంటి వద్దే రేషన్ డోర్ డెలివరీ ఇవ్వడానికి ప్రభుత్వం రేషన్ వాహనాలను కేటాయించింది. 2021 ఫిబ్రవరి నుంచి ఇంటింటికి రేషన్ పథకంలో భాగంగా డోర్ డెలివరీ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాలకు సంబంధించి 356 రేషన్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. తాజాగా వాహన మిత్ర పథకాన్ని రేషన్ వాహనాలకు కూడా అమలు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఈనెల 31న 5వ విడత వాహన మిత్ర పంపిణీలో భాగంగా జిల్లాలోని 356 రేషన్ వాహనదారులకు వాహనమిత్ర పథకం వర్తింపచేయనున్నారు.

మొత్తం రూ.35.60 లక్షల లబ్ధి

రేషన్ వాహనదారులకు కూడా రూ.10 వేల చొప్పున 356 వాహనాలకు రూ.35.60 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఇప్పటికే రేషన్ వాహనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.18 వేలు నెల నెలా చెల్లిస్తుంది. ఈ రూ.18 వేలతోపాటు వాహన మిత్ర ద్వారా ఇచ్చే రూ.10 వేలు రేషన్ వాహనదారులకు ఎంతో మేలు చేయనుంది. ముఖ్యంగా రేషన్ వాహనాలు నిరుద్యోగ యువత నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వారికి ఆర్థిక సాయాన్ని అందించడం ద్వారా రేషన్ వాహనం ద్వారా ఇంటింటికి డోర్ డెలివరీకి మరింత బాధ్యతగా చేయనున్నారు.

వాహన మిత్ర అమలు సంతోషదాయకం



రేషన్ డోర్ డెలివరీ చేస్తున్న వాహనాలకు కూడా వాహన మిత్ర పథకం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉంది. ప్రజల వద్దకు వెళ్లి రేషన్ ఇచ్చే వాహనాల నిర్వహణ, ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ ఆపరేటర్లకు రూ.10 వేలు సాయం చేయాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. ఈ 10 వేలు ఆపరేటర్లకు ఎంతో భరోసాగా ఉంటుంది.

– జువ్వల ప్రవీణ్ కుమార్, ఎండీయూ ఆపరేటర్ల జిల్లా అధ్యక్షుడు

ఈ ఏడాది నుంచి వాహన మిత్ర వర్తింపు



5వ విడత వాహన మిత్రలో ఈ ఏడాది రేషన్ డోర్ డెలివరీ చేసే ఎండీయూ ఆపరేటర్లకు కూడా రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. ఈనెల 31న వాహన మిత్ర 5వ విడత ఆర్థిక సాయం లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తాం. ఇంత వరకూ ఆటో, ట్యాక్సీ, మాక్సీ క్యాబ్ వంటి వాహనాలకు మాత్రమే వాహన మిత్ర వర్తించేది. తాజాగా నిర్ణయంతో 356 మందికి వాహన మిత్ర అందనుంది.

– టి.ఉమామహేశ్వరరావు, జిల్లా రవాణా శాఖాధికారి

ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరం తనిఖీ



పూలపల్లిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

పాలకొల్లు అర్బన్: సీడీఎన్‌సీడీ లక్ష్యాలను సక్రమంగా పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి డా.మహేశ్వరరావు కోరారు. పూలపల్లిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని బుధవారం డా.మహేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ నమోదు, ఈ–ఔషధి నమోదు వివరాలను డా.లీనా సుప్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. యు విన్ యాప్ ద్వారా నమోదు కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్ డి.కమల, ఎంఎల్‌హెచ్‌పీలు కృష్ణవేణి, శ్రావణి, ఏఎన్ఎం విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పాలకోడేరు: ఓటర్ల జాబితా ఇంటింటా పరిశీలన కార్యక్రమం పక్కాగా జరగాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి బీఎల్ఓలను ఆదేశించారు. బుధవారం పాలకోడేరు మండలం విస్సాకోడేరు నెంబరు–1 గ్రామ సచివాలయంను కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డోర్ టు డోర్ సర్వేలో ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని మిగిలి ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మరణించిన వారు ఎంత మంది ఉన్నారు.. వారి ఓట్లు డిలీట్ చేశారా లేదా అని పరిశీలించారు. కొత్తగా ఎన్ని ఓట్లు నమోదయ్యాయి, చేర్పులు మార్పుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, కంప్యూటరు డేటాను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని దోష రహితంగా తయారు చేయాలని ఆమె తెలిపారు. ఎన్నికల విధుల్లో వలంటీర్లను భాగస్వామ్యుల్ని చేస్తున్నట్లు తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గడువు సమీపిస్తున్నందున ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి మరింత వేగవంతం చేయాలని అన్నారు. ప్రతి ఓటరుకు ఇంటి సంఖ్య తప్పనిసరిగా వేయాలన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపులకు సంబంధించి పక్కా ఆధారాలు తీసుకోవాలన్నారు. ఒకే ఇంటి సంఖ్యలో ఎక్కువ ఓటర్లను సరిగా పరిశీలించి తప్పులుంటే సరిదిద్దాలని కలెక్టరు అన్నారు.

18 మంది సమరయోధుల విగ్రహాల ఆవిష్కరణ



తణుకులో స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: భావి తరాలకు దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో తణుకుకు చెందిన సమరయోధుల చరిత్ర తెలిపేందుకే ఆ మహానుభావుల విగ్రహాలను ఏర్పాటుచేశామని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు బ్యాంక్ కాలనీలోని స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన తణుకుకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను మంత్రి కారుమూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకులో రాజకీయాలకు అతీతంగా మాజీ ఎమ్మెల్యేలందరి విగ్రహాలతోపాటు వారి పేరుమీద కమ్యూనిటీ హాల్సు నిర్మాణం చేయించానని చెప్పారు. వైఎస్సార్ పార్కులో సైతం దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు పార్కులో ఏర్పాటుచేసిన మంత్రి కారుమూరిని అభినందనీయులని అన్నారు.

18 విగ్రహాల ఆవిష్కరణ

స్వాతంత్రోద్యమ పోరాటంలో ఉద్యమ బాట పట్టి జైలు జీవితాన్ని గడిపిన తణుకు వాసులు 18 మంది విగ్రహాలను తణుకు బ్యాంక్ కాలనీలోని స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంలో ఏర్పాటుచేశారు. వాటిని మంత్రి కారుమూరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అంతేకాకుండా వారి కుటుంబసభ్యులను వేదికపై ఘనంగా సత్కరించారు. సత్కార గ్రహీతలు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ పోరాటంలో పాల్గొన్న తమ పెద్దల విగ్రహాలను ఏర్పాటుచేసి వారి చరిత్రను తణుకు వాసులకు తెలియచెప్పిన మంత్రి కారుమూరి ధన్యుడన్నారు. ముందుగా వేదికపై పద్మజ నృత్య కళాక్షేత్రం నృత్యకారులు చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. ఈ సందర్భంగా థీమ్ రూపకర్త, సీనియర్ జర్నలిస్ట్ బెల్లంకొండ బుచ్చిబాబును మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, డాక్టర్ దాట్ల సుందర రామరాజు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



ఎన్నికల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో కేవీఎస్ఆర్ రవికుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని జెడ్పీ సీఈవో కేవీఎస్ఆర్ రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు –2023 సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావుతో కలిసి ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ శాంతియుత వాతావరణంలో వివాదాలకు తావులేకుండా నిర్వహించాలన్నారు. గత ఎన్నికల నిర్వహణ అనుభవం ప్రతి ఒక్కరికి ఉంటుందని, ఎలక్షన్ నిర్వహణలో కొత్త వారు ఎవరైనా ఉంటే అనుమానాలు, సందేహాలు నివృత్తి చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున్ రావు మాట్లాడుతూ ఇరగవరం మండలం కావలిపురం సర్పంచ్ పదవికి, 10 వార్డ్ మెంబర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగు, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందని అందుకు అనుగుణంగా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేసుకోవాలని జెడ్పీ సీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఎన్నికల జిల్లా నోడల్ అధికారి ఎన్‌వీఎస్ ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కడుపులో కత్తెర మర్చిపోయి కుట్లేశారు

- ఏలూరు జీజీహెచ్‌లో ఘటన
- విజయవాడ హాస్పిటల్‌లో బాధితురాలికి చికిత్స

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పెదపాడు మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన జి.స్వప్నకు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సిజేరియన్ చేసి కడుపులో కత్తెర మర్చిపోయి కుట్లేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 19న ఆమె డెలివరీ కోసం ఏలూరు సర్వజన ఆసుపత్రికి వచ్చింది. ఎంసీహెచ్ ప్రత్యేక విభాగంలో ఆమెకు సిజేరియన్ చేశారు. అనంతరం ఆరోగ్యంగా తల్లీబిడ్డ ఇంటికి వెళ్లారు. ఇటీవల ఆమెకు కడుపులో తీవ్రంగా నొప్పి రావటంతో ఈ నెల 8న ఏలూరు జీజీహెచ్‌లో జనరల్ వైద్యుల వద్దకు వచ్చింది. వైద్యులు ఎక్స్‌రే తీయించగా..ఆమె కడుపులో ఫోర్‌సెప్స్ (ఆపరేషన్ చేసినప్పుడు ఉపయోగించే వస్తువు)ను మరిచిపోయి కుట్లు వేసినట్లు గుర్తించారు. దీంతో ఆమెను విజయవాడ జీజీహెచ్‌కు రిఫర్ చేయగా.. అక్కడ స్వప్నకు ఆపరేషన్ చేసి పరికరాన్ని బయటకు తీశారు. ఆమె ప్రస్తుతం క్షేమంగా ఉంది. స్వప్న కడుపులో ఫోర్‌సెప్స్ పరికరం ఉన్నట్లు తెలిపే ఎక్స్‌రేను హాస్పిటల్‌లోని ఓ ఉద్యోగి సోషల్ మీడియాలో ఉంచాడు. స్వప్న కడుపులో ఫోర్‌సెప్స్ పరికరాన్ని ఉంచి కుట్లు వేసిన ఘటనపై కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశాలతో విచారణ కమిటీ వేసినట్లు ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్ చెప్పారు.

నా భూమి- నా దేశంలో భాగస్వాములు కావాలి

డీఆర్వో కె. కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో

భీమవరం (ప్రకాశంచౌక్): నా భూమి- నా దేశం కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. ఆగస్టు 9 నుంచి నా భూమి–నా దేశం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, నేటి వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణం వైపు ప్రజలంతా అడుగులు ముందుకు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ భావంతో మెలగాలన్నారు. నా మట్టి–నా దేశం కార్యక్రమాలు జిల్లాలోని ప్రతి పంచాయతీలో జయప్రదంగా నిర్వహించుకున్నామన్నారు. ప్రతి మున్సిపాలిటీలో నేటి నుంచి వివిధ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందన్నారు. దీనికి స్వచ్ఛంద సంస్థలు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు రూపొందించి జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. ఏ తేదీన, ఏ ప్రాంతంలో కార్యక్రమం చేపడుతున్నారో వివరాలు ముందుగానే తెలియజేస్తే దీనికి అనుగుణంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. నేటి తరానికి స్వాతంత్ర స్ఫూర్తిని తెలియచెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జీవీకె మల్లికార్జునరావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి, రెడ్‌క్రాస్ చైర్మన్ డా.రామ్ బద్రిరాజు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శోభ

- అధిక శ్రావణం నుంచి నిజ శ్రావణానికి
- పుణ్యప్రద మాసంగా మహిళలకు ప్రీతిపాత్రం
- వరలక్ష్మీ వ్రతాలు, మంగళగౌరీ వ్రతాలు, విశేష అలంకరణలు
- వ్యాపారుల్లో నూతనోత్సాహం



ఏలూరులోని 4 గుడుల సెంటర్లో కనకదుర్గ అమ్మవారి ఆలయం

ఏలూరు(ఆర్ఆర్‌పేట): శ్రావణ మాసమంటేనే ప్రత్యేకం.. ముఖ్యంగా మహిళలు ఈ మాసం కోసం ఏడాదంతా ఎదురుచూస్తారు. ఈ ఏడాది అధిక శ్రావణం రావడంతో మహిళలు మరో ల పాటు ఎదురుచూడక తప్పలేదు. ఎట్టకేలకు గురువారం నుంచి నిజ శ్రావణం వస్తుండడంతో మహిళల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఈ మాసం వస్తోందంటే తెలుగు గడ్డపై సందడి వాతావరణం నెలకొంటుంది. శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతం ఆచరించుకుని కుటుంబమంతా సుఖసంతోషాలతో ఉండాలని అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవార్లను కొలుచుకునే మాసంగా మహిళలకు ఈ మాసం ప్రీతిపాత్రం. శ్రావణ మంగళవారం మంగళ గౌరీ వ్రతం ఆచరించుకుంటే తమ మాంగల్యం పదికాలాలపాటు చల్లగా ఉంటుందనే నమ్మకం మహిళల్లో ఉంటుంది.

శ్రవణా నక్షత్ర ప్రవేశంతో ఆరంభం

శ్రావణ మాసం అంటే శ్రవణా నక్షత్ర ప్రవేశం. మహాశివుడికి ప్రీతిపాత్రమైన మాసం. తిరుమల తిరుపతి శ్రీనివాసుడి జన్మనక్షత్రం కూడా శ్రవణమే. ఈ మాసంలో శైవ క్షేత్రాలన్నీ ప్రత్యేక పూజలతో, అభిషేకాలతో ప్రతిధ్వనిస్తాయి. ఇతర తెలుగు మాసాల కంటే అధికంగా ఈ మాసంలో పండుగలు వస్తాయి. శ్రావణ మాసంలో నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంతో పాటు పలు కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు.

వ్యాపారుల్లో నూతనోత్సాహం

శ్రావణ మాసంలో వ్యాపారుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తుంది. ఈ మాసంలో అన్ని వ్యాపారాలూ ఊపందుకుంటాయి. ఈ ఏడాది ఆషాఢ మాసం తరువాత అధిక శ్రావణ రావడంతో రెండు నెలలుగా వ్యాపారాలు నత్తనడకన సాగాయి. గురువారం నుంచి వ్యాపారాలు జోరందుకుంటాయని వ్యాపారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ మాసంలో పూలు, పండ్లు, నిత్యావసరాల వినియోగం అధికంగా ఉంటుంది. వరలక్ష్మీ వ్రతం రోజునే కాక ప్రతి శ్రావణ శుక్రవారంతో పాటు శ్రావణ మంగళవారాల్లో కూడా మహిళలు ప్రత్యేక పూజలు ఆచరించడంతో ఆయా వస్తువులకు డిమాండ్ అధికంగా ఉంటుంది. వస్త్రదుకాణాలు కళకళలాడతాయి. బంగారు ఆభరణాల వ్యాపారాలు కూడా ఊపందుకుంటాయని వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. శ్రావణ మాసంలో బంగారు రూపులు, ఇతర వెండి పూజా వస్తువులు కొనుగోలు చేయడానికి మహిళలు ఆసక్తి చూపుతారు. దీంతో వస్త్రదుకాణాలతో పాటు, బంగారు ఆభరణాల వ్యాపారులు పలు ఆఫర్లను ప్రకటించి మహిళలను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు.

శ్రావణ మాసం శుభప్రదం



శ్రావణ మాసం హిందువులకు అత్యంత శుభప్రదమైన మాసం. ఈ మాసంలో ఆలయాల్లోని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించడం పుణ్యప్రదం. తమ కుటుంబాలు పదికాలాల పాటు చల్లగా ఉండాలని మహిళలు వరలక్ష్మీ వ్రతాలు, మంగళగౌరీ వ్రతాలు ఆచరిస్తారు. దీని ద్వారా లక్ష్మీ కటాక్షం, సౌభాగ్య ప్రాప్తి లభిస్తుంది. వరలక్ష్మీ వ్రతాలు సామూహికంగా ఆచరించుకోవడం మరింత పుణ్యప్రదం.

–వారణాశి శ్రీ రాఘవేంద్ర శర్మ, ప్రధానార్చకుడు, శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం



విశేష అలంకరణలో శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారు

25న వరలక్ష్మీ వత్రం

ప్రతి శ్రావణ మాసంలో రెండవ శుక్రవారం తెలుగు మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఏడాది వరలక్ష్మీ వ్రతం ఆగస్టు 25న వచ్చింది. మహిళలు ఇంట్లో ఉదయం వరలక్ష్మీ వ్రతాలు ఆచరించి, సాయంత్రం అమ్మవారి ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. ఆగస్టు 31న రాఖీ పౌర్ణమిని సోదరీ, సోదరుల అనుబంధానికి ప్రతికగా చేసుకుంటారు. సముద్రుడైన వరుణుడికి ఈ రోజు కొబ్బరి కాయలు సమర్పిస్తూ సముద్రంలోకి విసురుతారు. ఆ రోజు బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్యులు పాప ప్రక్షాళన కోసం పాత జంధ్యం తీసి కొత్తవి ధరిస్తారు. సెప్టెంబర్ 3న శ్రావణ బహుళ చవితి సందర్భంగా ప్రధాన సంకష్ట హర చతుర్థి వ్రతాలు ఆచరిస్తారు. పార్వతీ దేవికి ఈ వ్రతం గురించి గణపతి చెప్పిన రోజుగా పురాణాలు ఈ రోజును చెబుతున్నాయి. ఆ రోజున వివిధ గణపతి ఆలయాల్లో వినాయకుడికి విశేష పూజలు, వ్రతాలు చేస్తారు. సెప్టెంబర్ 6న శ్రీకృష్ణ జన్మాష్టమి.. సెప్టెంబరు 14న పోలాల అమావాస్యతో ఈ ఏడాది శ్రావణ మాసం ముగుస్తుంది. .

క్లుప్తంగా

డీఈఎల్ఈడీ పరీక్షకు 163 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ మూడో సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. సెమిస్టర్ పరీక్షలకు 147 మంది విద్యార్థులకు 143 మంది హాజరు నలుగురు గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ పరీక్షకు 70 మందికి 20 మంది హాజరు కాగా 50 మంది గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

బైక్ చోరీ కేసులో వ్యక్తికి జైలు

తణుకు/ఇరగవరం: ఇరగవరం మండల కేంద్రంలో బైక్ చోరీకి సంబంధించి ఒక వ్యక్తికి ఆర్నెల్లు జైలు శిక్ష విధిస్తూ తణుకు మొదటి అదనపు మొదటి తరగతి న్యాయమూర్తి పీవీ నాగరంజిత్‌కుమార్ బుధవారం తీర్పు ఇచ్చారు. గ్రామానికి చెందిన వనచర్ల త్రినాథ రావు జూన్ 13న మోటారుసైకిల్ హోటల్ ఎదురుగా ఉంచి భోజనం చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్ ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కాపుల పాలెం గ్రామానికి చెందిన గాలిదేవర పెద్దిరాజు చోరీ చేసినట్టుగా నిర్ధారించారు. అతన్ని కోర్టులో హాజరు పరచగా విచారణ అనంతరం పెద్దిరాజుకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ హనుమంతు వాదించగా ఎస్సై చంద్రశేఖర్, కోర్టు లైజినింగ్ అధికారి కృష్ణమూర్తి సహకరించారు. ఇదే వ్యక్తికి కొన్ని రోజులు క్రితం మరో మోటర్ సైకిల్ దొంగతనం కేసులో 6 నెలలు జైలు శిక్ష పడటం గమనర్హం.

వైట్‌కాలర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ మేరీ ప్రశాంతి

జంగారెడ్డిగూడెం: భూ ఆక్రమణలు, వైట్ కాలర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం ఆమె జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. సాధారణ తనిఖీల్లో భాగంగా తాను జంగారెడ్డిగూడెం వచ్చినట్టు చెప్పారు. కేసుల స్థితిగతులు, రికార్డుల మెయింటెన్స్, సిబ్బంది పనితీరు తదితర విషయాలను పరిశీలించానన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో భూ ఆక్రమణలపై స్థానిక అధికారులకు ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. ఇక్కడ భూముల విలువ పెరగడంతో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్ గ్యాంగ్‌ల విషయంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే ఈ భూ ఆక్రమణలకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలని, తమ భూమి ఆక్రమణకు గురైనట్టు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఆక్రమణదారుడిపై ట్రెస్‌పాసింగ్ కింద ఛార్జిషీటు నమోదు చేస్తామని, అవసరమైతే కౌన్సిలింగ్ కూడా ఇస్తామని చెప్పారు. కొన్నిసార్లు ఈ భూముల విషయంలో సివిల్ కోర్టులో కేసులు ఉండటం వల్ల సరైన ఆధారాలు లేకపోవడంతో ఇన్వెస్టిగేషన్ ఆలస్యం అవుతుందని అన్నారు. అయినప్పటికీ ఇటువంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.



జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

మోసాలపై అప్రమత్తత అవసరం

వైట్‌కాలర్ నేరాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేయడం తదితర మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఇప్పటికే సామాజిక మాధ్యమాలు ద్వారా ఇటువంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బాధితులు ఇటువంటి మోసాలపై సరైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వైట్‌కాలర్ నేరాల విషయంలో బాధితులు సత్వర పరిష్కారం ఆశిస్తున్నారని, సదరు నేరస్తులకు శిక్ష పడేలా వారు సరైన సహకారం అందించడం లేదని అన్నారు. ప్రజల ఆలోచనలో కూడా మార్పు రావాలని కోరారు. బుట్టాయగూడెం మండలం దొరమామిడి ఆర్అండ్ఆర్ కాలనీలో అదృశ్యమైన బాలుడి కోసం ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఒక ఇన్‌స్పెక్టర్‌తో స్పెషల్ టీమ్‌ను కూడా ఈ కేసులో నియమించినట్టు చెప్పారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌ను టౌన్ పోలీస్‌స్టేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, సిబ్బందిని పెంచేందుకు కృషిచేస్తామని తెలిపారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు మౌలిక వసతుల కల్పనకు, భవన నిర్మాణానికి ప్రయత్నిస్తామని చెప్పారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీఎస్పీ ఎం.ధనుంజయుడు, సీఐ పి.రాజేష్, ఎస్సై ఎం.సాగర్‌బాబు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో నన్నయ్య విద్యార్థినికి పతకాలు



రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ కనబర్చిన న్యూరోసి

తాడేపల్లిగూడెం: భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో స్థానిక నన్నయ్య క్యాంపస్‌లో బీ ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతోన్న వి.న్యూరోసి ప్రతిభ కనబర్చి బంగారు, రజత పతకాలను కైవసం చేసుకుందని విభాగాధినేత హీరాభట్టు బుధవారం తెలిపారు. అసాధారణ నైపుణ్యం ప్రదర్శించిందని కొనియాడారు. క్యాంపస్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీరమేష్, తదితరులు న్యూరోసికి అభినందనలు తెలిపారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్‌లు

సాక్షి, భీమవరం: ఆటో ప్రయాణికుల సంక్షేమం కోసం ఆటోలకు క్యూఆర్ కోడ్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు క్యూఆర్ కోడ్ నమూనాను బుధవారం రాత్రి ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమవరంలో సుమారుగా రెండు వేల వరకు ఆటోలు ఉన్నాయని, ఈ ఆటోలన్నింటికీ క్యూఆర్ కోడ్లను ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి, డ్రైవర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నామని చెప్పారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డ్రైవర్ల పూర్తి వివరాలు కూడా తెలుస్తాయన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ట్రాఫిక్ సీఐ దాసు, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ, పంపన గిరి తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

నాడు – నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఐటీడీఏ పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో చేపట్టిన నాడు – నేడు పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా తర్వతగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అధికారులను ఆదేశించారు. నాడు – నేడు పనులపై బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు. పోలవరం మండలాలకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో ఆయన బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొదటి, రెండోవ దశలో చేపట్టిన పనులు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ పరిధిలో సుమారు 68 సచివాలయాల పనులు చేపట్టగా సుమారు 38 భవన నిర్మాణాలు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు 39, విలేజ్ క్లినిక్‌లు 19 భవన నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని పీఓకు వివరించారు. ఐటీడీఏ పరిధిలో సుమారు 75 నాడు – నేడు పనులు చేపట్టగా, 70 పాఠశాలలు, 5 అంగన్‌వాడీ సెంటర్లలో పనులు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ఎంఈఓలు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కేఆర్‌పురం ఐటీడీఏలో నాడు - నేడు పనులపై అధికారులతో చర్చిస్తున్న పీఓ సూర్యతేజ

గిరిజన దర్బారుకు వినతులు

కేఆర్‌పురం ఐటీడీఏలో నిర్వహించిన గిరిజన దర్బారులో పీఓ ఎం.సూర్యతేజ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడెం సమీపంలోని పునరావాస గ్రామంలో ఉంటోన్న వేలేరుపాడు మండలం చిగురుమామిడి నిర్వాసితులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐఎంఎల్ ప్రజా పందా నాయకులు ఎస్‌కే గౌసు, కట్టా వీరాస్వామి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఐటీఐ కళాశాలలో హాస్టల్ భవనం నిర్మించాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు వినోద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పలువురు తమ సమస్యలను పీఓ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ-పంట నమోదు వేగవంతం చేయాలి



లింగపాలెం: ఈ ఏడాది ఖరీఫ్‌నకు సంబంధించి ఈ-పంట నమోదు వేగవంతం చేయాలని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ ఆదేశించారు. బుధవారం ఆయన లింగపాలెం మండలం యడవల్లి గ్రామంలో వ్యవసాయ సిబ్బంది చేస్తోన్న ఈ-పంట నమోదును పర్యవేక్షించారు. పలుసూచనలు చేశారు. ప్రతి రైతూ ఖరీఫ్‌లో సాగు చేసే పంటను తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో నాణ్యత గల అన్ని రకాల ఎరువులు రైతులకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఇప్పటివరకు లింగపాలెం మండలంలో 2700 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేశారని తెలిపారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలని సూచించారు. రామకృష్ణ వెంట చింతలపూడి ఏడీఏ బి.నాగకృష్ణ, లింగపాలెం ఎంఏఓ కె.మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం 16వ వార్డులో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



ఆకివీడు : ఆకివీడు నగర పంచాయతీ 1వ వార్డులో మహిళలకు పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పొజిషన్ సర్టిఫికెట్ జారీపై విచారణ

ద్వారకాతిరుమల: బదిలీ అయిన వీఆర్వో సంతకంతో ఉన్న పొజిషన్ సర్టిఫికెట్‌ను చూపి, ఖాళీ స్థలానికి రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది వివాదాస్పదం కావడంతో పొజిషన్ సర్టిఫికెట్‌ను బదిలీ అయిన వీఆర్వోనే జారీ చేశారా, లేక రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు సృష్టించారా అనేదానిపై ద్వారకాతిరుమల తహసీల్దార్ పి.సతీష్ విచారణ చేపట్టారు. సర్వే నిర్వహించి వివాదాస్పద భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అత్తిలి మండలం పాలి గ్రామానికి చెందిన రామేశ్వరపు మల్లేశ్వరశర్మకు ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం కాలనీలో ఒక ఇల్లు ఉంది. దానికి పడమర వైపు ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని మద్దాల సత్యనారాయణ, లక్ష్మీ నరసమ్మ దంపతులు ఆక్రమించారని గత నెల 17న మల్లేశ్వరశర్మ జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేస్తుండగానే.. ఆ స్థలం లక్ష్మీ నరసమ్మ పేరున భీమడోలు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయ్యింది. తిమ్మాపురం వీఆర్వోగా పనిచేసి, వేరే ప్రాంతానికి బదిలీ అయిన ఎ.వీర్రాజు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడతో లక్ష్మీ నరసమ్మ పేరున రిజిస్ట్రేషన్ జరిగిందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని మల్లేశ్వరశర్మ తహసీల్దార్ పి.సతీష్‌కు ఈనెల 9న ఫిర్యాదు చేశారు. పొజిషన్ సర్టిఫికెట్ గతనెల 28న వీఆర్వో వీర్రాజు సంతకంతో జారీ అయ్యిందని, ఆ సమయానికి ఆయన అక్కడ విధులు నిర్వర్తించడం లేదని తహసీల్దార్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న వీఆర్వో వీర్రాజు ఉంగుటూరు మండలానికి డిప్యుటేషన్‌పై వెళ్లారని, అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా మే 31న పెదవేగి మండలానికి బదిలీ అయ్యారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం



నూజివీడు: నూజివీడు మండలం తుక్కులూరులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాల లత (28) అనే యువతి అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన లత తన అక్క కుమారుడు గత్తం జన్ని(16)తో కలిసి మధ్యాహ్నం బైక్‌పై వెళ్తుండగా సెంటర్లో బండి స్కిడ్ అయ్యి రోడ్డుపై పడిపోయారు. ఆ సమయంలో జంక్షన్ వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో లత మృతి చెందింది. లతకు వివాహం కాలేదు. జన్నీ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం

- ● రూ.1.08 కోట్లు చెల్లించేందుకు యూబీఐ నిర్ణయం
- ● ఫలించిన ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పోరాటం

ఆగిరిపల్లి (నూజివీడు): ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేసిన పోరాట ఫలితంగా స్వయం సహాయక సంఘాలకు చెందిన దాదాపు 700 మంది మహిళలకు న్యాయం చేకూరింది. బీసీ పాయింట్ నిర్వాహకులు స్వాహా చేసిన రూ.1.08 కోట్లను చెల్లించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) అంగీకరించింది. సంబంధిత నగదును ఆగిరిపల్లిలోని యూబీఐ బ్రాంచికి కేటాయించింది. బుధవారం బ్యాంకులో రెండు గ్రూపుల మహిళలకు సెటిల్‌మెంట్ ధ్రువ పత్రాలను ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేశారు. వివరాల్లోకెళితే.. ఆగిరిపల్లి మండలం సగ్గూరు, నర్సింగపాలెం గ్రామాల్లోని డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాల తాలూకా వాయిదాల సొమ్ము రూ.1.08 కోట్లు బీసీ పాయింట్ నిర్వాహకులు స్వాహా చేశారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే ప్రతాప్ బ్యాంకు ఉన్నతాధికారులతో చర్చించారు. మహిళలకు న్యాయం చేయాలని పట్టుపట్టారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దిగొచ్చి ఎమ్మెల్యేతో చర్చలు జరిపి జులై 31లోగా సెటిల్ చేస్తామని, అనంతరం ఆగస్టు 15వ తేదీలోగా సెటిల్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో బ్యాంకులో ఎమ్మెల్యే ప్రతాప్‌తో డిప్యూటీ రీజనల్ హెడ్ బి.హరీష్ మాట్లాడారు. బీసీ పాయింట్ నిర్వాహకులు స్వాహా చేసిన రూ.1.08 కోట్లను డ్వాక్రా సంఘాల ఖాతాల్లో జమ చేయడానికి బ్యాంకు హెడ్ ఆఫీసు అంగీకరించిందని, రోజుకు నాలుగైదు గ్రూపులు చొప్పున ఈనెలాఖరు నాటికి అన్ని గ్రూపుల్లో వారికీ సొమ్ము జమ చేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రతాప్, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ సమక్షంలో హరీష్ డ్వాక్రా మహిళలకు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యే ప్రతాప్‌ను సత్కరించారు. తహసీల్దార్ ఉదయభాస్కర్, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, నాయకులు మచ్చా హరిబాబు, సగ్గూరు సర్పంచ్ దిలీప్, సీఐ రాజులపాటి అంకబాబు, ఎస్సై నంబూరి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకులో హరీష్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే

దొంగతనానికి వచ్చి పట్టుబడిన యువకులు



నిందితులను చెట్టుకు కట్టేసిన దృశ్యం

కాళ్ల: కాళ్ల మండలం కోలనపల్లిలో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి యత్నించి పట్టుబడ్డారు. స్థానికులు కథనం ప్రకారం.. కాళ్లకు చెందిన తోట సత్యనారాయణ కుటుంబంతో కోలనపల్లి గ్రామంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి ఆయన ఆరుబయట నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో ఐదుగురు యువకులు కారులో వచ్చి సత్యనారాయణ ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. ఇది గమనించిన సత్యనారాయణ, స్థానికులతో కలిసి అడ్డుకున్నాడు. నిందితుల్లో ముగ్గురు పరారయ్యారు. మరో ఇద్దర్ని గ్రామస్తులు బంధించి చెట్టుకు కట్టేశారు. కారులో వచ్చిన యువకులు జువ్వలపాలెంకు చెందినవారుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

బాలుడి హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

పెంటపాడు: మండలంలోని మీనవిల్లూరు గ్రామంలో ఈనెల 9న జరిగిన బాలుడి హత్యకేసులో ప్రధాన ముద్దాయిలు తాత నాగేశ్వరరావు, తండ్రి సత్యనారాయణ, నానమ్మ లక్ష్మిలను పెంటపాడు పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. బుధవారం కోర్టులో హాజరుపర్చారు. తాడేపల్లిగూడెం రూరల్ సీఐ ఎంవీవీఎస్ మూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోకల శిరీష, సత్యనారాయణలకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. శిరీషకు భర్త, అత్తామామల మధ్య శిరీషకు ఆస్తి తగాదా ఉంది. భర్త నాగేశ్వరరావు ప్రవర్తన సరిగాలేదు. ఈ నేపథ్యంలో శిరీష తన భర్తను వదిలి పిల్లలతో విడిగా ఉండేందుకు పెద్దల వద్ద రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. కోడలు విడిగా ఉంటే ఆస్తి తమ ముగ్గురికి కాకుండా శిరీషకు, ఆమె పిల్లలకు వెళ్లిపోతుందనే భయంతో శిరీష మామ నాగేశ్వరరావు తన మనుమడు పోకల కల్యాణ్ వెంకట్ (6)ను అడ్డు తొలగించుకోవాలని కుమారుడు సత్యనారాయణ, భార్య లక్ష్మిలతో ఈనెల 8న రాత్రి కుట్రపన్నాడు. పథకం ప్రకారం ఈనెల 9న ఉదయం స్కూల్‌కి వెళుతున్న బాలుడు కల్యాణ్‌ను తాత నాగేశ్వరరావు నడిపించుకొంటూ గ్రామం దాటి యనమదుర్రు గట్టు వైపు నుంచి గణపవరం మండలం కోమర్రు వైపుగా తీసుకెళ్లి కాలువలోకి దింపి ముక్కు, నోరు చేతులతో మూసివేసి ఊపిరి ఆడకుండా నీటిలో ముంచి చంపేశాడు. ఈ కేసును ఎస్పీ రవిప్రకాష్, గూడెం డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి అరెస్టు చేసిన గణపవరం ఎస్సై, పెంటపాడు ఇన్‌చార్జి ఎస్సై వి.వెంకటేశ్వరరావు, హెచ్‌సీ పాండురంగారావు, కానిస్టేబుల్ కె.నవీన్, రాజేష్‌లను సీఐ అభినందించారు.

వృద్ధురాలిపై దాడి

భీమడోలు: వృద్ధురాలిపై దాడి చేసి గాయపర్చిన గుండుగొలను గ్రామానికి చెందిన మెండ్యాల శ్రీనుకు బుధవారం భీమడోలు కోర్టులో మేజిస్ట్రేట్ తల్లాప్రగడ అంజనీ ఎస్ఎస్ రామాదిత్య రిషిక్ రిమాండ్ విధించారు. నిందితుడు శ్రీనుని ఏలూరులోని జిల్లా జైలుకు పంపినట్టు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు నేమాల మంగకు సుమారు రూ.16 లక్షలు తీసుకుని నకిలీ డైమండ్‌ను మెండ్యాల శ్రీను ఇచ్చాడన్నారు. మోసపోయిన మంగ గతంలో ఫిర్యాదు చేయగా నిందితుడిపై చార్జిషీట్ వేశామని చెప్పారు. ఇదిలాఉండగా మంగకు అప్పిచ్చిన వారు డబ్బులు అడుగగా శ్రీను ఇవ్వగానే చెల్లిస్తానని సమాధానం చెప్పిందన్నారు. విషయం తెలుసుకున్న శ్రీను కోపోద్రిక్తుడైన మంగ ఇంటికి వెళ్లి ఆమె ఎడమ చేతిని విరగ్గొట్టాడన్నారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామని ఎస్సై తెలిపారు.

బండి డిక్కీలో ఉంచిన రూ.10 లక్షలు అపహరణ

భీమవరం: భీమవరం రెండో పట్టణంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహన డిక్కీలో ఉంచిన రూ.10 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. చినఅమిరం గ్రామానికి చెందిన అడ్డాల శ్రీనివాస్ స్థలాన్ని విక్రయించగా వచ్చిన రూ.10 లక్షలు ద్విచక్రవాహనం డిక్కీలో పెట్టారు. ఏఎస్ఆర్ నగర్‌లోని ఓ ఇంటిలోకి వెళ్లి వచ్చేసరికి బండి డిక్కీ తెరిచి ఉంది. దీంతో సీఐ జి.శ్రీనువాస్, సిబ్బంది సీసీ కెమెరా పుటేజీ పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు వెంబడించినట్లు తెలిసింది.

పౌరసేవా.. ఇంత సులువా

జగనన్న సురక్షతో సులభంగా ధ్రువీకరణ పత్రాలు



ప్రత్తిపాడులో జగనన్న సురక్ష పథకంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న డీపీవో మల్లికార్జునరావు, తహసీల్దార్ శేషగిరిరావు తదితరులు (ఫైల్)

పెంటపాడు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చింది. ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువచేయడమే లక్ష్యంగా విప్లవాత్మక మైన మార్పులు, సంస్కరణలు తీసుకొస్తోంది. ఆ కోవలోనే తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. సాంకేతిక కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సైతం అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందజేయటంతో ప్రభుత్వ నిర్ణయంపై జేజేలు పలికారు ప్రజలు. ఒక్క మాటలో చెప్పాలంటే పౌరసేవలు ఇంత సులువా అన్న రీతిలో వైఎస్సార్ సీపీ పాలన సాగుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ప్రశంసలు కురిసాయి. జులై 1 నుంచి 27 వరకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం గొప్పగా విజయవంతమైంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా చూడటంతో పాటు, జనన, మరణ, కుల, ఆదాయ, సీసీఆర్సీ, రేషన్‌కార్డు, 11 రకాల ధ్రువపత్రాలను అందజేసారు. ఇలాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడూ చూడలేదంటూ సేవలు పొందిన వారంతా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకొని సత్వరం పరిష్కరించడం చాలా బాగుందంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

సర్వీసు చార్జీలు లేకుండా.....

ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, మరణధ్రువీకరణ పత్రం, మ్యూటేషన్ ఫర్‌ట్రాన్స్‌క్షన్, కొత్త రేషన్ కార్డు, విభజన, ఆధార్‌లో మొబైల్ నెంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు, వివాహ ధ్రువీకరణ పత్రం, కుటుంబవివరాల్లో కొంతమంది సభ్యులపేర్లు యాడ్ చేయడం, వంటి సేవలు పౌరులకు అందించారు.

సమష్టి కృషితోనే సాధ్యం



సమిష్టి కృషి కారణంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎక్కువ మందికి ధ్రువపత్రాలు అందించగలిగాం. మా సిబ్బంది కార్యాలయ పని సమయంలోనే కాకుండా అధనంగా పనిచేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి వల్ల ఎక్కువ మందికి సేవలందించగలిగాం.

– జీవీ శేషగిరిరావు, తహసీల్దార్ పెంటపాడు మండలం

సురక్షతో ఎంతో మేలు



జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రలో మరువరానిది. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి ఇలా ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను సులభతరం చేయలేదు. మా గ్రామం నుంచి పెంటపాడు మండల కార్యాలయానికి చాలా దూరం. పనులు మానుకొని అక్కడకు వెళ్లకుండా కాళ్లవద్దకు అవసరమైన ధ్రువపత్రాలను అధికారులు అందించినందుకు కృతజ్ఞతలు. ప్రత్యేకంగా ఒక నెల రోజులపాటు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడింది. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– గొర్రెల కోటేశ్వరరావు, పరిమెళ్ల గ్రామ సర్పంచ్

వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ధరించని వాహనదారులకు సూచనలు చేస్తున్న ఎస్సై ప్రసాద్

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని పట్టణ ఎస్సై జి.జె ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని రహదారులపై హెల్మెట్ ధరించని వాహనదారులను నిలిపివేసి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించడం వలన వాహనదారుడికి, వారి కుటుంబ సభ్యులకు రక్షణ ఉంటుందన్నారు. ఎక్కువ ప్రమాదాలు సంభవించిన సమయంలో హెల్మెట్ ధరించని కారణంగా మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రయాణ సమయాల్లో హెల్మెట్లు ధరించి సురక్షితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీనివాస్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డు



జెడ్పీ చైర్‌పర్సన్ నుంచి ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకుంటున్న శ్రీనివాస్

అత్తిలి: మండల పరిషత్ ఉద్యోగి కోటిపల్లి శ్రీనివాస్ ఉత్తమ ఉద్యోగిగా అవార్డును అందుకున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయిలో ఏలూరులో జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు, ప్రశంసా పత్రాన్ని శ్రీనివాస్ స్వీకరించారు. ఉత్తమ అవార్డు అందుకున్న శ్రీనివాస్‌ను మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందించారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంలో విద్యార్థినులకు బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: గతేడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థినులకు బ్యాగులు, విద్యాసామాగ్రిని అందజేసారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామానికి చెందిన కీర్తిశేషులు దాసం సత్యనారాయణ మనుమలు తూము ఆదిత్య, సాహిత్యలు డి కుముదవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సర్పంచ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా



మాట్లాడుతున్న జోనల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అభివృద్ధి పథంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుందని విశాఖపట్నం జోనల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలోని బ్యాంక్ శాఖలను సందర్శనలో భాగంగా బుధవారం ఆయన తాడేపల్లిగూడెం పట్టణంలో మాట్లాడుతూ విశాఖపట్నం జోన్‌లో 83 శాఖలు వ్యవసాయ కృషి వికాస్ కేంద్రాలు కలిగి మంచి వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల వారికి బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు అందిస్తూ వారి వృత్తి వ్యాపారాలకు సహకరిస్తుందని వెల్లడించారు. బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎన్.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ తమ బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీవీ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్‌లు, పలువురు పట్టణ ప్రముఖులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



లచ్చన్న చిత్రపటానికి నివాళ్లలర్పిస్తున్న బీసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గౌతు లచ్చన్న జయంతిని బీసీ సంఘం నాయకులు బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ లచ్చన్న జీవిత విశేషాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, బీసీ సంఘం నాయకులు తాతా శ్రీనివాసరావు, కోట రాంబాబు, తుమరాడ చిన్న, సుధీర్, మారిశెట్టి నరసింహమూర్తి తదితరులు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పించారు.

శ్రీఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

అత్తిలి: అత్తిలి గ్రామంలో వేంచేసియున్న శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం లెక్కించారు. 2022 జూలై 1 నుంచి 2023 ఆగష్టు 14 వరకు గల కాలానికి భక్తులు హుండీ ద్వారా సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ. 33,477లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల వెంకటరమణ, దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ దుడే ఉమామహేశ్వరరావు తెలిపారు.

వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వయో వృద్ధుల సమస్యలను పరిష్కరించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం యూనిట్, ఏపీ రాష్ట్ర వయో వృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. పట్టణంలో బుధవారం సంఘ సభ్యుల పిలుపు మేరకు ప్రపంచ వయో వృద్ధుల కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. వృద్ధులకు సంబంధించిన సమస్యల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యలను ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీకే వీరారావు, వైవీ సత్యనారాయణమూర్తి, దాసం నాగేశ్వరరావు, బి.సత్యనారాయణ రాజు, ఎండీ ముస్తాఫా, కానూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి

తణుకు టౌన్: వయో వృద్ధుల సంక్షేమాన్ని కోరుతూ తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచ వయో వృద్ధుల కోర్కెల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గోదావరి, మానిక్యాలరావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే నాగేశ్వరరావు, కార్యదర్శి ఎస్ చలపతిరావు, సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు సమాజంలో విస్తరించాలి

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



తణుకు లయన్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు టౌన్: సమాజంలో లయన్స్ ఇంటర్నేషనల్ ద్వారా సేవలను విస్తరించడానికి క్లబ్ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ కోరారు. బుధవారం తణుకు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన తణుకు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలను అభినందించారు. నూతన కార్యవర్గ సభ్యులతో లయన్స్ జిల్లా గవర్నర్ దామెర రంగారావు ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ 2023-24 అధ్యక్షుడిగా యాతం నాగరాజకుమార్, కార్యదర్శిగా ఎం రవి రిజనాల్డ్, కోశాధికారిగా శీరం ఉమామహేశ్వరరావులతో పాటు మరో పది మంది బోర్డు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈకార్యక్రమంలో లయన్స్ రీజినల్ చైర్మన్ మదన్ మోహన్ అగర్వాల్, జోన్ చైర్మన్ ఎంఆర్ కోటేశ్వరరావు, ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'బడుగు వికాసం' పథకంలో రుణాల మంజూరుకు వినతి



జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాజాను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంగరాజు తదితరులు

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అమలు చేస్తున్న బడుగు వికాసం పథకం నిరుద్యోగులకు ఎంతో ప్రయోజనకరమని, బ్యాంకుల ద్వారా ఎక్కువ మందికి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజాను కోరినట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ జిల్లా సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి భీమవరం విచ్చేసిన మంత్రికి ఈ మేరకు వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. బడుగు వికాసం పథకం ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారని, అయితే జిల్లాలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాల మంజూరుకు మరింత ముందుకు వచ్చేలా చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని మంత్రిని కోరినట్లు చెప్పారు. మంత్రిని కలసిన వారిలో పొన్నమండ బాలకృష్ణ, కటికతల రాజారావు ఉన్నారు.

ఆర్ అండ్ బీ రోడ్లకు నిధులు మంజూరు



ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: వీరవాసరం మండలానికి సంబంధించి కీలకమైన ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్ ప్రక్రియ ముగుస్తుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ అధికారులతో బుధవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరవాసరం నుంచి మత్స్యపురి వరకు 7 కిలోమీటర్ల మేర రూ.6 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే వీరవాసరం నుండి నౌడూరు వరకు 6 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వేమవరం నుంచి రాయకుదురు వరకు 4.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ జరుగుతోందన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ ముగిసి రోడ్ల నిర్మాణ పనులను చేపడతామని ఆయన వెల్లడించారు. అదేవిధంగా మరికొన్ని రోడ్లకు సంబంధించి రూ.20 కోట్ల నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని ఆయన స్పష్టం చేశారు. సమీక్షలో డీఈ రమణ, జేఈ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థినులకు యూనిఫామ్ అందజేత

వీరవాసరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ మహిళా కళాశాల విద్యార్థినులకు బుధవారం యూనిఫామ్‌ను ఉచితంగా అందజేశారు. పాఠశాలలో చదివిన 1984 –85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుమారు రూ.50 వేలు విలువ గల యూనిఫామ్సను విద్యార్థులకు బహుకరించారు. గతంలో ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.60 వేలు విలువ గల ఐరన్ గేటును ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులను గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో గుబ్బల సత్యనారాయణ, గెద్దం భాస్కరరావు, పోలిశెట్టి సత్యనారాయణ, జవ్వాది దాశరధి శ్రీనివాసరావు, షేక్ సత్తార్ సాహెబ్ పాల్గొన్నారు.

కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు

కాళ్ల: పాత గొడవలు నేపథ్యంలో ఓ వ్యక్తిని కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన తోట భోగేశ్వరరావు రొయ్యల సాగు చేస్తుంటాడు. ఈనెల 13వ తేదీ రాత్రి తన చెరువు వద్ద నుంచి ఇంటికి వస్తున్న సమయంలో పాత గొడవలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన నూకల సురేష్ మద్యం సేవించి దారికాచి దాడి చేశాడు. ఈ దాడిలో భోగేశ్వరరావుకు గాయాలయ్యాయి. గాయాలపాలైన భోగేశ్వరరావును అతని సోదరుడు వరప్రసాద్ చికిత్స నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

సంక్షేమ పథకాలు, జవాబుదారీతనంతో..

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- గూడెం 16వ వార్డులో గడపగడపకూ...



గూడెం 16వవార్డులో ప్రజలతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా, ప్రజలకు జవాబుదారీతనంలో పనిచేయాలన్న ఉద్దేశ్యంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని 16వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీసారు. ప్రభుత్వ విధివిదానాలు, పాలన విషయాలపై ప్రజల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైన వారందరికీ అనవరమైన ధ్రువపత్రాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించే విధంగా అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచనలు చేశారు. ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో ప్రజలను మోసగించి మళ్లీ అధికారం చేపట్టేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నాడని నమ్మవద్దని హితవు పలికారు. 16వ వార్డులో మంచినీటి పైపు లైను నిర్మాణానికి పూజ కార్యక్రమాలను మంత్రి కొట్టు చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్, కర్రి భాస్కరరావు, గుండుమోగుల బలుసులు, వట్టి బుజ్జి, రాజా త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి వర్ధంతిని తాడేపల్లిగూడెంలో బీజేపీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద బీజేపీ శ్రేణులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఓసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ఐనం బాలకృష్ణ, మానవతా సంస్థ డైరెక్టర్ సింధు, యువమోర్చ నాయకులు మానేపల్లి భార్గవ్, తుమరాడ చిన్నాలు మాట్లాడారు. అడపా రమేష్, పాటి నాగేశ్వరరావు, చిట్యాల రాంబాబు, రామగాని సత్యనారాయణ, వీఎల్ నారాయణ, ఎ.వెంకట లక్ష్మి, శిరిగినీడి పాండురంగారావు, చెరుకూరి గంగాధర్, ఇమ్మంది బెనర్జీ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ్ సేవలు అభినందనీయం



మునిసిపల్ కమిషనర్ శామ్యూల్‌ను సత్కరిస్తున్న ఆదర్శ్ సేవ సభ్యులు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదర్శ్‌సేవలు అభినందనీయమని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్, బజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు డి.సోమసుందర్‌లు అన్నారు. ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశం పట్టణంలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రొక్కాల నాగ బుజ్జి ఆధ్వర్యంలో వివిధ సేవలు అందిస్తున్న ప్రభుత్వ అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, సోషల్ వర్కర్స్, స్వచ్ఛంధ సేవా సంస్థలు, రాజకీయ నాయకులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, జర్నలిస్టులకు ఆదర్శ్ అవార్డులు అందజేశారు.

ప్రజా సమస్యలపై సీపీఐ బస్సు యాత్ర



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సమస్యలపై సీపీఐ చేపట్టిన బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం కపర్థి భవనంలో ప్రచార జాత కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ టౌన్ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈనెల 17వ తేదీన విశాఖపట్నం నుంచి బస్సు యాత్ర బయలుదేరుతుందన్నారు. 36 మంది ప్రాణ త్యాగం చేసిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నుంచి ప్రారంభమై 26 జిల్లాలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఈ యాత్ర జరుగుతుందన్నారు. రోడ్డు షోల్లో భాగంగా ఈ నెల 22వ తేదీన యాత్ర తణుకు చేరుతుందని బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభకు పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరు కావాలని కోరారు.ఈ యాత్ర సెప్టెంబర్ 8వ తేదీన పెద్ద తిరుపతిలో ముగిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అల్లం రాము, దాస్యం రాము, అల్లం నరేంద్ర, రావూరి బాబీ, బొమ్మిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ నిర్ణయించిన ధరలనే వసూలు చేయాలి



లక్కీ డ్రాలో సభ్యునికి బహుమతి అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): షామియాన అసోసియేషన్ నిర్ణయించిన రేట్లనే వినియోగదారుల నుంచి వసూలుచేయాలి, అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని షామియానా ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరంగుల నరసింహమూర్తి హెచ్చరించారు. బుధవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని కల్యాణ మండపంలో నెలవారి సమావేశం నిర్వహించారు. అనంతరం నెలవారి లక్కీడ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో పీ.వీ.వీ.సత్యనారాయణ, ఎం.వి.ఎస్ సుబ్రహ్మణ్యం, కాళ్ళ రవి, యాపాడ ప్రకాష్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఎస్.నరేంద్రరావు, జేకే కృష్ణ, పట్నాల రామకృష్ణ, సోమరాజు, రమణ, భాషా, నాగేశ్వరరావు, నారాయణ, బత్తిన శ్రీనివాస్, కె.సురేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఇరువురు విద్యార్థులకు ఓరుగంటి సుందరి మెరిటోరియస్ అవార్డు కింద ఒక్కొక్కరికి రూ.25వేలు నగదు బహుమతి అందజేశారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అలుమిని అసోసియేషన్‌కు చెందిన వీకే విశ్వనాథరాజు మాట్లాడుతూ అమెరికాలో ఉన్నత స్థానంలో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థి ఓరిగంటి శివభరత్ స్కాలర్‌షిప్ ఏర్పాటు చేసి, ప్రతి ఏటా మూడో సంవత్సరం చదువుతున్న అన్ని బ్రాంచ్‌ల్లోని టాపర్స్‌కు నగదు బహుమతి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఫైనల్ ఇయర్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఈదర సాత్విక, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థిని దేవులూరి రాజరాజేశ్వరికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు నేటితో ప్రచారం పూర్తి

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ పంచాయతీ 8వ వార్డుకు జరిగే ఉప ఎన్నికకు సంబంధించి ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం వరకూ ప్రచారాన్ని నిర్వహించాలని ఎంపీడీవో పీ శ్రీనివాసరావు తెలిపారు. ఉప ఎన్నిక సమయానికి 48 గంటల ముందే గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకి ప్రచారాన్ని ముగించాలని ఇరు పార్టీల అభ్యర్థులకు సూచించినట్లు తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని, అనంతరం లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు.

నరసాపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం

నరసాపురం రూరల్: పట్టణంలో ఓ వీధి కుక్క బుధవారం వీధుల్లో సంచరిస్తూ పలువురుని గాయపర్చింది. దీంతో ఒక్క సారిగా పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మెయిన్‌రోడ్డు, కోర్టు వీధి, కోటిపల్లివారి వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓ కుక్క వీధుల్లో సంచరిస్తూ పలువురిని కరిచింది. పట్టణానికి చెందిన పి.శ్రీనివాస్, ఎస్.సునీల్ అనే ఇద్దరు యువకులతో పాటు రాధ, వై.గాజులమ్మ, ఏవీ సుబ్బలక్ష్మి అనే ముగ్గురు వృద్ధురాళ్లు, గన్నాబత్తుల వీరాంజనేయులు, ఎస్.అప్పారావు అనే వ్యక్తులను పిచ్చికుక్క గాయపర్చింది. దీంతో వారందరికీ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇచ్చినట్లు ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జాన్ హారిసన్ తెలిపారు. అయితే ఇటీవల కాలంలో తరచూ కుక్క కాటుకు గురైన కేసులు ఆసుపత్రికి వస్తున్నాయని ఆయన తెలిపారు.నిత్యం ఇటువంటి సంఘటనలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.